నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, సోమవారం 26 ఫిబ్రవరి 2024 | BHADRADRI KOTHAGUDEM

# సౌర విద్యుత్‌తోనే పర్యావరణ పరిరక్షణ



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, చిత్రంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ)/ రామవరం: సోలార్ విద్యుత్తే ప్రత్యామ్నాయ మార్గమని, ఈ విద్యుత్తుతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని డిప్యూటి సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఇదే స్ఫూర్తితో తెలంగాణలోనూ నూతన విద్యుత్ పాలసీని అమలు చేస్తామని స్పష్టం చేశారు. సింగరేణి యాజమాన్యం కొత్తగూడెం ఏరియాలోని రామవరంలో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలో కార్మికులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 80శాతం కొలువులు స్థానికులకే ఉద్యోగాలు ఇచ్చే పాలసీని అమలు చేస్తామన్నారు. థర్మల్ పవర్ ప్లాంట్ల కారణంగా పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ భూముల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. సింగరేణీయుల సమస్యలు పరిష్కారం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తమ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సోలార్ విద్యుదుత్పత్తిని మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. సింగరేణి యాజమాన్యం ఓపెన్‌కాస్టుల్లో ఓవర్ బర్డెన్ తీసిన తర్వాత అక్కడ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయవచ్చన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు యాజమాన్యం హైపవర్ కమిటీ వేతనాలను చెల్లించాలన్నారు. సింగరేణీయులు, విశ్రాంత సింగరేణీయుల సొంతింటి కలను నెరవేర్చాలన్నారు. ఏరియాల పరిధిలోని శాసన సభ్యులను కలుపుకొని యాజమాన్యం పని చేయాలని విజ్ఞప్తి చేశారు. శాసనాలు చేయాలన్నా, చట్టాలుచేయాలన్నా శాసన సభ్యులతోనే అవుతుందన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, రాందాస్‌నాయక్, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, మట్టారాగయి, భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల, సింగరేణి సీఎండీ ఎన్.బలరాం, డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) డి.సత్యనారాయణరావు, డైరెక్టర్ పీపీ వెంకటేశ్వరరెడ్డి, జీఎం (సోలార్) జానకీరామ్, జీఎం (సీపీపీ) జక్కం రమేశ్, కొత్తగూడెం ఏరియా జీఎం షాలెంరాజు, జీఎం (సివిల్) టి.సూర్యనాయణ, ఎస్వోటూ జీఎం కోటిరెడ్డి, ఏజీఎం ఈఅండ్‌ఎం దుర్గాప్రసాద్, ఏజీఎం సివిల్ రామకృష్ణ, ఎస్ఈ ఈ అండ్‌ఎం శ్రీకాంత్, పర్సనల్ మేనేజర్ శివకేశవరావు పాల్గొన్నారు.



హాజరైన సింగరేణీయులు, కార్మికులు, ప్రజాప్రతినిధులు

# సర్కారు వైద్యం అంతంతమాత్రం



జిల్లా ఆసుపత్రి ఎదుట నిలిచిన మురుగు

- ప్రభుత్వ దవాఖానల్లో సమస్యలు తిష్ఠ
- జిల్లా ప్రధాన ఆసుపత్రికీ మినహాయింపు లేదు..
- వేధిస్తున్న వైద్యుల కొరత.. వైద్యసిబ్బంది అలసత్వం
- కలెక్టర్ ప్రియాంక ఆల హెచ్చరించినా మార్పు శూన్యం

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): భద్రాద్రి జిల్లాలోని సర్కార్ దవాఖానల్లో సమస్యలు ఎక్కడ వేసినా గొంగడి అక్కడే.. అన్న చందంగా తిష్ఠ వేశాయి. ఒక ఆసుపత్రిలో వైద్యుల కొరత వేధిస్తుంటే.. మరో ఆసుపత్రిలో వసతులు అరకొర.. ఇంకో ఆసుపత్రిలో ఏకంగా మాతాశిశు మరణాలు.. వెరసి ప్రభుత్వ దవాఖానలు నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో వందశాతం విఫలం.

## పారిశుధ్య నిర్వహణ అధ్వానం..

కొత్తగూడెంలోని జిల్లా ప్రధాన ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. ఆసుపత్రిలో ఏ విభాగానికి వెళ్లినా దుర్గంధం వెదజల్లుతున్నది. ఆసుపత్రికి వచ్చిన ప్రజలు ముక్కు మూసుకుని వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఆసుపత్రి ఆవరణలో మురుగు ప్రవహిస్తుండడం గమనార్హం. ఆసుపత్రిలో తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన ట్యాంక్‌ల నుంచి చుక్కనీరు కూడా రాకపోవడం విచారకరం. ఇక మరుగుదొడ్లయితే ఎప్పుడూ తెరిచి ఉండవు. కొత్తగూడెం జిల్లా ప్రధాన ఆసుపత్రికి అనుసంధానమైన రామవరం మాతాశిశు కేంద్రంలో ఇటీవల మాతాశిశు మరణం సంభవించినా వైద్యులు, సిబ్బంది పనితీరులో ఎలాంటి మార్పులేదని ఆసుపత్రికి వచ్చిన గర్భిణులు ఆరోపిస్తున్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అనేకసార్లు కలెక్టర్‌కు అనేకసార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోయింది. కలెక్టర్ ప్రియాంక ఆల రెండు మూడుసార్లు ఆసుపత్రిని సందర్శించి వైద్యాధికారులు, సిబ్బందిని హెచ్చరించినా వారిలో మార్పు లేదు.

## ఇతర దవాఖానల్లోనూ ఇదే పరిస్థితి..

బూర్గంపాడులో ఇప్పటికీ పురాతన భవనంలోనే పీహెచ్‌సీ నడుస్తున్నది. అరకొర వసతుల మధ్యే ప్రజలు అక్కడ వైద్యసాయం పొందుతున్నారు. అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో కనీసం ఒక అంబులెన్స్ అయినా అందుబాటులో లేకపోవడం గమనార్హం. అలాగే జిల్లాలోని ప్రభుత్వ డయాలసిస్ కేంద్రాల్లో రోగులకు సరైన వసతుల్లేవని, బెడ్లు సరిపోయినన్నీ ఉంటే వారికి మెరుగైన సేవలు అందుతాయని ఇటీవల జరిగిన జడ్పీ సమావేశాల్లో ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇంత అలసత్వం ఉన్నా వైద్యారోగ్యశాఖ పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



తాళం వేసి ఉన్న మరుగుదొడ్డి



నిరుపయోగంగా వాటర్ ట్యాంక్

### మణుగూరులో వంద 'సమస్యల' ఆసుపత్రి..



కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రి వంద పడకల ఆసుపత్రిగా రూపాంతరం చెందింది. తర్వాత వైద్యులు ఆసుపత్రి పరిధిలో జటిలమైన ఆపరేషన్లు చేసి ప్రజల మెప్పు పొందారు. కానీ కొద్ది రోజులుగా ఆసుపత్రి సమస్యల నెలవుగా మారింది. ప్రస్తుతం ఆసుపత్రి పరిధిలో సర్జరీలేమీ జరగడం లేదు. అత్యవసర వైద్యసేవలు అందించేందుకు వైద్యులు చేతులెత్తేస్తున్నారు. తీవ్రమైన జబ్బులతో వచ్చే బాధితులను భద్రాచలం ఏరియా ఆసుపత్రి, కొత్తగూడెం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారు. దీనిపై డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబును 'నమస్తే' వివరణ కోరగా.. ఆసుపత్రి పరిధిలో ఎనస్తీషియన్ లేరని, అలాగే సిబ్బంది కొరత కారణంగా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిచలేకపోతున్నామని సమాధానమిచ్చారు.

### పెద్దాసుపత్రిలో ఇన్ని సమస్యలా..?



పేరుకే జిల్లా ప్రధాన ఆసుపత్రి. కానీ ఆసుపత్రిలో అన్నీ సమస్యలే. వైద్యం కోసం హాస్పిటల్‌కు వచ్చిన వారికి సరైన మెడిసిన్ అందడం లేదు. బ్లడ్ శాంపిల్స్ తీయడానికి కనీసం కిట్లు లేకపోవడం బాధాకరం. వైద్యులు సమయ పాలన పాటించడం లేదు. ఆసుపత్రి పరిధిలో పారిశుధ్య చర్యలు సరిగా లేవు. ఆస్పత్రిలో ఎక్కడికి వెళ్లినా దుర్గంధమే.

**– దూడల బుచ్చయ్య, మున్సిపల్ కో–ఆప్షన్ మెంబర్, కొత్తగూడెం**

# మాజీ ఎమ్మెల్యే మెచ్చాతో రేగా భేటీ



మెచ్చాతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతరావు

దమ్మపేట, ఫిబ్రవరి 25 : మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుతో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదివారం సమావేశం అయ్యారు. మండలంలోని తాటిసుబ్బనగూడెంలోని మెచ్చా నివాసంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వారు పార్టీ బలోపేతం, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలని చర్చించుకున్నారు.

# భద్రాద్రి జిల్లాకు ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్‌సాయి



భద్రాద్రి సీతారామచంద్రస్వామి ఆలయ సన్నిధిలో ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి

సారపాక/ భద్రాచలం, ఫిబ్రవరి 25: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలో ఆదివారం బీజేపీ తలపెట్టిన సంకల్పయాత్ర సభకు హాజరయ్యేందుకు ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి విచ్చేశారు. తొలుత బూర్గంపహాడ్ మండలం సారపాకలోని బీపీఎల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకోగా ఆయనకు భద్రతా దళాలు స్వాగతం పలికి గౌరవ వందనం చేశాయి. అనంతరం సీఎం ఐటీసీ గెస్ట్ హౌస్‌కు పయనమయ్యారు. తర్వాత భద్రాచలం పట్టణానికి చేరుకున్నారు. సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో రమాదేవి, అర్చకులు సీఎంకు స్వామివారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు.

# ఎమ్మెల్యే వెంకట్రావును కలిసిన రాకేశ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యేతెల్లం వెంకట్రావు , ఏనుగుల రాకేశ్‌రెడ్డి

భద్రాచలం, ఫిబ్రవరి 25: భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావును ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి కలిశారు. వారిద్దరూ ప్రస్తుత రాజకీయాల గురించి మాట్లాడుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ భద్రాచలం, బూర్గంపహాడ్ మండలాల అధ్యక్షుడు అరికెల్ల తిరుపతిరావు, రమణారెడ్డి, నాయకులు రమేశ్‌గౌడ్, కొండముక్కల సాయిబాబా, ఆకోజు సునీల్ కుమార్, గాడి విజయ్, ఆకుల వెంకట్, పుల్లగిరి నాగేంద్ర, ఆకుల రామకృష్ణ పాల్గొన్నారు.

# పెద్దమ్మతల్లి ఆలయంలో భక్తుల సందడి



మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 25 : మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి కనిపించింది. సెలవురోజు కావడంతో ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లలకు అన్నప్రాసన, తలనీలాల కార్యక్రమాలు జరుపుకున్నారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఆలయ అధికారులు భక్తులకు కావల్సిన ఏర్పాట్లను సమకూర్చారు. ఆలయ కమిటీ చైర్మన్ మహీపతి రామలింగం, ధర్మకర్తలు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై హైదరాబాద్‌కు చెందిన నాగమణి 'శివలీలలు' హరకథా కాలక్షేపం నిర్వహించారు.

# భద్రాద్రి రామయ్యకు స్వర్ణ పుష్పార్చన



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

భద్రాచలం, ఫిబ్రవరి 25: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం అంతరాలయంలోని మూలవరులకు 108 స్వర్ణ పుష్పాలతో అర్చకులు అర్చన జరిపారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామికి సుప్రభాతం పలికి, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, తదితర నిత్య పూజలను జరిపారు. అనంతరం అంతరాలయంలో మూలమూర్తులకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. స్వామివారి నిత్య కల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం జరిపారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

# మందుపాతర పేలి జవాన్ మృతి

## ఛత్తీస్‌గఢ్‌లో ఘటన

కొత్తగూడెం క్రైం, ఫిబ్రవరి 25: ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఓ జవాన్ మృతిచెందాడు. బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. బీజాపూర్ జిల్లా బేచపాల్ బేస్‌క్యాంపునకు చెందిన ఛత్తీస్‌గఢ్ ఆర్మ్‌డ్ ఫోర్స్ (సీఏఎఫ్) జవాన్లు ఏరియా డామినేషన్‌లో భాగంగా ఆదివారం చప్టాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో సీఏఎఫ్ హెడ్ కానిస్టేబుల్ ఆశిష్ యాదవ్ ఓ చప్టాపై నడుస్తుండగా మావోయిస్టులు అమర్చిన ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజీవ్ డివైస్ (ఐఈడీ) పేలి తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే ఆ ప్రాంతాన్ని భారీగా భద్రతా బలగాలు మోహరించాయని, మావోయిస్టుల కోసం సెర్చింగ్ ఆపరేషన్‌ను ముమ్మరం చేసినట్లు ఎస్పీ తెలిపారు.

# దిబ్బగూడెంలో దేశీ వరిసాగు

## దేశవాళీ విత్తనాలతో అద్భుతాలు

## ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో సాగు

## ఆదర్శంగా నిలుస్తున్న గిరిజన రైతులు

## సహకారం అందిస్తున్న 'నాబార్డు'

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 25 : రైతన్నలు ఏనాడో మరిచిన దేశీవరి వంగడాలను పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు అశ్వారావుపేట మండలం మల్లాయిగూడెం పంచాయతీ పరిధిలోని దిబ్బగూడెం గిరిజన రైతులు. ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో దేశవాళీ విత్తనాలతో వరి పండిస్తూ అధిక దిగుబడులు సాధించి ఔరా అనిపిస్తున్నారు. వివరాల్లోకెళ్తే.. నాబార్డు వారి సహకారంతో వాసన్ సంస్థ పర్యవేక్షణలో జీవకమిటీ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో గిరిజన గ్రామాల్లో ర్యాలీలు సైతం నిర్వహించి రైతులకు దేశీయ వరి సాగుపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఈక్రమంలో గిరిజన రైతుల ఆలోచనా సరళి మారింది. దిబ్బగూడెంలో సుమారు 70 కుటుంబాలు ఉండగా 18 కుటుంబాల వారు దేశీవరి సాగు చేసేందుకు ముందుకొచ్చారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చనే నమ్మకంతో పలువురు రైతులు గో ఆధారిత వ్యవసాయంపై ఆసక్తి కనబర్చారు. నాబార్డు వారి సహకారంతో ఈ సంవత్సరం కుళ్లాకార్, మాలీపూర్, కూచీపాటలీ, నవార, ఇంద్రాణి తదితర వరి వంగడాలను పండించి అద్భుతాలు సాధించారు. ఈ బియ్యం తింటే షుగర్, బీపీ, రక్తహీనత వంటి అనారోగ్య సమస్యలు దరి చేరవని చెబుతున్నారు.



జీవామృతం తయారీని పరిశీలిస్తున్న నాబార్డు డీడీఎం

### యాసంగిలో మాలీపూర్ సాగు చేశాను..

నా వయస్సు 65 ఏళ్లు. భర్త చనిపోయాడు. పిల్లలు లేరు. 4 ఎకరాల భూమి ఉంది. దానిలో 3 ఎకరాలు కౌలుకు ఇచ్చాను. ఎకరంలో నేను తినడానికి యాసంగి సీజన్‌లో జీవకమిటీ, వాసన్ సంస్థ సహకారంతో మాలీపూర్ వరి వంగడం సాగు చేశాను. ఆవు పేడ, ఆవు మూత్రంతో తయారుచేసిన జీవామృతం ప్రతి 15రోజులకు పిచికారీ చేస్తున్నా. ఘన జీవామృతం కూడా వరిలో చల్లాను, కలుపురాకుండా అజోల్లా కూడా వేశారు. నాటువేసి 60 రోజులు దాటింది. ఈ బియ్యం ఆహారంగా తీసుకుంటే గర్భిణులకు సులభంగా కాన్పు జరుగుతుంది. పిల్లలకు జ్ఞాపకశక్తి పెరుగుతుంది. బలమైన పోషకాలు ఉంటాయని చెప్పారు. అందుకే సాగుచేశాను. ఇప్పటివరకు కషాయాలకు, నాటు వేయడానికి రూ.2 వేలలోపు మాత్రమే ఖర్చు అయింది. ఖరీఫ్‌లో పూజా విత్తనం వేశాను. 16 బస్తాలు దిగుబడి వచ్చింది. బస్తా రూ.2500లకు అమ్మాను. ఖర్చు రూ.5 వేలు లోపు మాత్రమే అయింది. గతంలో ఎప్పుడు యాసంగిలో వరి సాగు చేయలేదు. పెట్టుబడి తక్కువని కుళ్లాకార్, మాలీపూర్ రబీలో కొద్దికొద్దిగా సాగు చేశాను. పంట చాలా బాగుంది. నా పంటను చూసేందుకు చాలామంది వస్తున్నారు. అందరికీ ప్రకృతి వ్యవసాయం చేయమని చెబుతున్నాను. నా భూమిలో పండిన వరి విత్తనాలు కావాలని అడుగుతున్నారు. ఇస్తానని చెప్పాను.



**– మొడియం సింగమ్మ, దిబ్బగూడెం**

### తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం



నేను కుళ్లాకార్ దేశవాళీ వరి సాగు చేశాను. గతంలో ఎప్పుడు ఈ పంట గురించి నాకు తెలియదు. జీవకమిటీ ద్వారా తెలుసుకున్నాను. ఎలా ఉంటదోనని అర ఎకరం సాగు చేశాను. 90 రోజుల పంట. ఇప్పటికి రూ.2 వేల లోపు ఖర్చు అయింది. జీవామృతం, ఘన జీవామృతం పిచికారీ చేశాను. రసాయనాలు ఏమీ వాడకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించవచ్చనే నమ్మకం కలిగింది. ఎరువులు వాడిన పంట కంటే ఈ పంట చాలా బాగుంది. భూమిలో కూడా తేడా గమనించాను. ఆరోగ్యం బాగుంటుంది. మొదట్లో భయపడ్డాను. పొటాషియం, కార్బొహైడ్రేట్స్, కాల్షియం, ప్రోటీన్స్ అధికంగా ఉంటాయని చెప్పారు. మరో నెలరోజుల్లో పంట చేతికొస్తుంది.

**– జమ్మి జయరాజు, దిబ్బగూడెం**

### ఎకరానికి 25బస్తాలు పండించాను..



ఈ వానకాలం సీజన్‌లో ఎకరంలో 'నవార' దేశవాళీ వరి రకం వేసి 25 బస్తాలు పండించాను. విత్తనాలు నాబార్డు సహకారంతో వాసన్ సంస్థ వారు పరిగి నుంచి తెప్పించారు. వరి మడుల్లో జీలుగు విత్తనాలు చల్లి 40రోజుల తర్వాత కలియదున్ని దమ్ము చేసి నాటువేశాను. నారుపోసిన 15 నుంచి 18రోజుల మధ్య నాటువేశాను. తొలిసారి భూమిలో రసాయనిక ఎరువులకు బదులు గోవుమూత్రం, పేడ, గోధుమపిండి, బెల్లం, గుప్పెడు పుట్టమట్టితో తయారుచేసిన బీజామృతం బీఆర్‌సీ కేంద్రం నుంచి తీసుకొచ్చి పిచికారీ చేశాను. అమావాస్య, పున్నమి(15రోజులకోసారి) పిచికారీ చేశాను. 125 రోజుల నుంచి 130రోజుల తర్వాత కోతకు వచ్చింది. ఈ బియ్యం తినడం వల్ల షుగర్, బీపీ కంట్రోల్ అవుతుంది. నరాల బలహీనత కీళ్ల నొప్పులకు మంచిది. కిలో బియ్యం రూ.200 అమ్ముతున్నాను. రెండుపూటల తినకుండా ఒకపూట ఆహారంగా తీసుకోవచ్చు. మేము వారంలో 2, 3 రోజులు తీసుకుంటాము. యాసంగిలో నవార, మాలీపూర్, కుళ్లాకార్ ఎకరన్నరలో కొద్దికొద్దిగా సాగు చేశాను. ఇప్పటివరకు నాటువేసి 60రోజులు దాటింది. ఖర్చు రూ.3 వేలు దాటింది.

**– మొడియం రాములమ్మ, దిబ్బగూడెం**